క్లుప్తంగా

పోస్టర్ ఆవిష్కరణ



తెనాలిఅర్బన్: ఆంధ్రప్రదేశ్ రజక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఈ నెల 26న రజక ఆత్మగౌరవ మహా సభను నిర్వహించనున్నట్లు ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు పాతపాటి అంజిబాబు తెలిపారు. గంగానమ్మపేటలోని వైఎస్సార్ సీపీ తెనాలి నియోజకవర్గ కార్యాలయంలో మహాసభకు సంబంధించిన వాల్‌పోస్టర్‌లను ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అంజిబాబు మాట్లాడుతూ నాగార్జున యూనివర్శిటీ ఎదురుగా ఉన్న వీరనారి చిట్యాల ఐలమ్మగారి ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు చెప్పారు. రజక సంఘాల నాయకులు, రజక కులస్థులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెనాలి పట్టణ రజక సంఘ అధ్యక్షుడు పెసర్లంక రమణ, నాయకులు మల్లేశ్వరరావు, కొవెరపు శంకర్, గుంటూరు పూర్ణ, తదితరులు పాల్గొన్నారు.

బట్టీ పట్టే విధానానికి స్వస్తి



తెనాలిఅర్బన్: బోసు రోడ్డులోని నెహ్రూ నికేతన్ ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో శుక్రవారం చిన్నారులు వారి తల్లిదండ్రులతో కలసి వివిధ రకాల గృహ నమూనాలను తయారు చేసి ప్రదర్శించారు. ఈ సందర్భంగా స్కూల్ మేనేజింగ్ డైరెక్టర్ దాసరి మురళీకాంత్ మాట్లాడుతూ బట్టీ పట్టే విధానానికి స్వస్తి పలికి నమూనాల ద్వారా చిన్నారుల్లో అనేక అంశాలపై అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తప్పనిసరిగా పాఠశాలకు హాజరు కావాలి



తెనాలిఅర్బన్: బడిఈడు పిల్లలందరూ తప్పనిసరిగా పాఠశాలలకు హాజరు కావాలని మండల విద్యాశాఖ అధికారి–2 వి.జయంతిబాబు అన్నారు. పట్టణంలోని 23వ వార్డు, చంద్రబాబునాయుడు కాలనీలో శుక్రవారం పాఠశాలకు గైర్హాజరయిన విద్యార్థుల ఇళ్లకు ఆయన వెళ్లారు. తరచూ పాఠశాలలకు ఎందుకు గైర్హాజరవుతున్నారనే దానిపై ఆరాతీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలకు వచ్చే విద్యార్థులకు ప్రభుత్వం అనేక సదుపాయాలు కల్పిస్తోందన్నారు. తల్లిదండ్రులు విద్యార్థులను పాఠశాలలకు పంపాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీ శ్రీదేవి, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నాగుల చవితి పూజలు



తెనాలిటౌన్: నాగుల చవితి వేడుకలను ప్రజలు భక్తిశ్రద్ధలతో శుక్రవారం జరుపుకున్నారు. గంగానమ్మపేటలోని పాత శివాలయంలో భక్తులు విశేషంగా పూజలు జరిపారు. ఆలయ ఆవరణలో ఉన్న నాగేంద్రస్వామి పుట్ట వద్ద పాలు పోసి పూజలు చేశారు. మారీసుపేటలోని చంద్రమౌళేశ్వర స్వామి ఆలయంలో మహిళలు ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ ఆవరణలో ఉన్న పుట్టలో పాలు పోసి, పూజలు చేశారు. ఆలయ అర్చకులు భక్తులకు హారతి ఇచ్చి దీవించారు. కొలకలూరులోని రైల్వే బ్రిడ్జి కింద ఉన్న నాగేంద్రస్వామి ఆలయం వద్ద నాగుల చవితి వేడుకలను జరిపారు. మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రేపట్నుంచి కొల్లిపరలో కొలుపులు

కొల్లిపర: కొల్లిపర గ్రామంలో ఆదివారం నుంచి గ్రామ దేవతలైన గంగానమ్మ, ముత్యాలమ్మ, మారెమ్మ, మద్దిరావమ్మలకు ప్రత్యేక పూజలు చేశారు. మత సమైక్యతకు తార్కాణంగా మదార్ సాహెబ్‌కు ప్రాముఖ్యతనిస్తూ గ్రామ కొలుపులను నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు ఈ సందర్భంగా తీర్మానించారు. శుక్రవారం గ్రామ పెద్దలు మాట్లాడుతూ కొలుపుల్లో ముస్లింలకు కూడా ప్రాముఖ్యత ఇవ్వటం వల్ల హిందువులు, ముస్లింలు ఒకటే అని ఇరువురిలో సోదర భావం పెరుగుతుందని గ్రామంలో గత కొన్ని శతాబ్దాలుగా ఇరువర్గాల వారు కలసి గ్రామ కొలుపు నిర్వహించటం జరుతుందన్నారు. కొలుపులు 19న ప్రారంభమై డిసెంబరు మూడు వరకు జరుగుతాయన్నారు. ఈ విధంగా పూర్వ కాలం నుంచి గ్రామంలో కొలుపులు రెండేళ్లకొసారి నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

దివిసీమ ఉప్పెనపై ఆక్రోశం 'కొయ్యగుర్రం'

- తుపాను వ్యవస్థపై తెలుగు కవి కన్నెర్ర
- తొలి ఆధునిక మహాకావ్యంగా గుర్తింపు
- తెలుగు వచన కవితకు గట్టి పునాది




నగ్నముని

తెనాలి: 'కొయ్యగుర్రం తొలి ఆధునిక రాజకీయ తాత్విక కావ్యం...విశ్లేషకులు దీన్ని మహాకావ్యం అన్నారు. వచన కవిత ఒక రూపంగా గట్టిగా నిలదొక్కుకుందంటే కారణం కొయ్యగుర్రం' తుపాను వ్యవస్థపై తెలుగు కవి కన్నెర్రగా వెలువడిన దీర్ఘకవిత 'కొయ్యగుర్రం'పై సమీక్షల్లో ఇదొకటి. 1977 నవంబరు 19న వచ్చిన తుపానుపై ప్రకృతి విలయతాండవానికి ప్రజల్ని వదిలేసిన నాటి పాలకుల అసమర్థతపై నగ్నముని ఆక్రోశం దీర్ఘకవితగా పెల్లుబికింది. పాలకులు ఊరేగుతున్న కొయ్యగుర్రాన్ని తగులబెట్టాలని హితబోధ చేసింది. ప్రముఖ రచయిత, కవి నగ్నముని రచించిన కొయ్యగుర్రం పుస్తకం నాలుగున్నర దశాబ్దాల తర్వాత నాలుగో ప్రచురణగా వెలువడింది. రచయిత స్వస్థలమైన తెనాలిలో ఈనెల 19న సాయంత్రం ఆవిష్కరించనున్నారు.

ప్రభుత్వాల వైఫల్యంపై..

స్వాతంత్ర్యం అనంతరం పార్లమెంటరీ రాజకీయాంశాన్ని మొదటిసారి సాహిత్య రంగంలో ఒక 'వస్తువు'గా ప్రవేశపెట్టినవారు నగ్నముని. ప్రభుత్వాల వైఫల్యంపై 'దిగంబర కవిత్వం'తో సంచలన నిరసన తెలిపారు. సాహిత్యాన్ని ఉద్యమ స్థాయికి తీసుకెళ్లిన దిగంబర కవిత్వానికి 'కర్త, కర్మ, క్రియ నేనే'నంటూ సగర్వంగా ప్రకటించుకున్నారు. ఎమర్జన్సీపై అకృత్యాలపై 'విలోమ కథలు'తో అధిక్షేపం తెలియజేశారు. ప్రజల మనస్సులను తమకు అనుగుణంగా మార్చే కార్పొరేట్ వ్యూహాలపై 'ఆకాశదేవర' కథలో హెచ్చరించారు. పాలకుల అసమర్థతపై రచించిన 'కొయ్యగుర్రం' తొలి ఆధునిక మహాకావ్యంగా, రాజకీయ తాత్విక కావ్యంగా లేవనెత్తిన చర్చ ఒక చరిత్ర.



నగ్నముని కొయ్యగుర్రం పుస్తకం

1977 నవంబరు 19న ఉప్పెన వల్ల జరిగిన దారుణాల కారణాల లోతుల్లోకి వెళ్లి, ఆక్రోశాన్ని వెల్లడించి, తుపాను వ్యవస్థపై మనకు ఆగ్రహాన్ని కలిగించటమే కొయ్యగుర్రం కావ్య లక్షణం. ఆనాటి దారుణానికి ఇంత గాఢమైన ఆక్రోశం వెల్లడించే కవిత్వాన్ని చూడలేదని ఆచార్య చేకూరి రామారావు అప్పట్లో అన్నారు. 'వచన కవిత్వం అధోగతిలో ఉన్న సమయంలో ఉదాత్తమైన వస్తువుతో 'సీరియస్‌నెస్' ఎక్కడా చెడకుండా 'ఫ్రీవర్స్'నే కవితా వాహకంగా గ్రహించి ఆధునిక మహాకావ్యాన్ని సృష్టించి, ఒకేసారి తెలుగు కవిత్వాన్ని–వచన కవిత్వాన్ని–ఆధునిక కవిత్వాన్ని మళ్లీ పైకెత్తారు నగ్నముని' అనిపించుకున్నారు.

ప్రకృతి విలయ తాండవానికి ప్రజల్ని వదిలేసిన పరిపాలకులే హంతకులన్న విషయం కొయ్యగుర్రం కావ్యం చదివితే అర్థమవుతుంది...కొయ్యగుర్రాన్ని తగులబెట్టగల కొత్త ఇంధనాన్ని కనిపెట్టటమే కర్తవ్యం అని గుర్తుచేసింది. ప్రజలు తమ ప్రతినిధులుగా పరిపాలకులను ఎన్నుకునేటప్పుడు–వారి సమర్థత, అసమర్థతలను ప్రధానంగా దృష్టిలో తీసుకోవలసి ఉంటుందని స్పష్టం చేశారు నగ్నముని. 'ఈ రచనలో నగ్నముని ఆలోచనా పరిధి విస్తరించి తాత్వికస్థాయికి చేరాడు' అన్నారు పురాణం సుబ్రహ్మణ్యశర్మ. కొయ్యగుర్రం పుస్తకంపై తర్వాతికాలంలో ప్రముఖ రచయితల వ్యాఖ్యానాలతో 'కావ్యావలోకనం','కొయ్యగుర్రం దార్శనికత' సంకలనాలు వచ్చాయి. 'గ్లోబల్ సందర్భంలో నగ్నముని కొయ్యగుర్రం' పేరుతో మరో పుస్తకం వెలువడింది. రష్యన్, ఇంగ్లిష్, హిందీ, పంజాబీ, మరాఠీ, మైథిలి, ఒరియా, తమిళం, కన్నడ భాషల్లోకి అనువాదమైంది.

ఎనిమిది దశాబ్దాల క్రితం తెనాలిలో కళ్లుతెరిచిన మానేపల్లి హృషీకేశవరావు, నగ్నమునిగా మారడం అంత తేలిగ్గా జరగలేదు. తండ్రి మానేపల్లి సంగమేశ్వర కవి పద్య వారసత్వాన్ని కొనసాగించాడు. పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్ష రాసి, ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో ప్రవేశించేనాటికి ఆయన వయసు పద్దెనిమిదేళ్లు. నాలుగు దశాబ్దాలపాటు రాజకీయ నేతల అసలు రూపాన్ని దగ్గరగా చూశారు. ఆయన కవిత్వం మొదలుపెట్టేనాటికి కాలం అనేక సంక్షోభాలను చవిచూసింది. అయిదు దశాబ్దాల నగ్నముని సాహిత్య జీవితం, తెలుగునేలపై జరిగిన అన్ని కల్లోలాలను ఒక క్రమపద్ధతిలో నమోదుచేసింది. తెలుగు సాహిత్య వాక్యానికి రాజకీయ వాసనలు అద్దాడు. రాజ్యహింసను, నిర్బంధాలనూ అనుభవించాడు. పత్రికల్లో కాలమ్ వ్యాసాలు రాశారు. మరో చరిత్ర, ఎంఎల్‌ఏ ఏడుకొండలు, త్రిశూలం, ఉదయం సినిమాలకు మూల కథలు సమకూర్చారు. అంతకుముందే ఉన్నవ లక్ష్మీనారాయణ 'మాలపిల్ల' నవలను నాటకీకరించారు. ఈ నాటకాన్ని ఏఆర్ కృష్ణ వందకుపైగా ప్రదర్శనలిచ్చారు. 2011లో రచించిన 'ఆకాశదేవర'ను పాటిబండ్ల ఆనందరావు నాటకీకరించారు. తెనాలిలో అజోవిభోకందాళం ఫౌండేషన్ నగ్నమునిని సత్కరించి 'సాహితీ వైజయంతి' శీర్షికతో సన్మాన విశేషసంచికను విడుదల చేశారు.

గ్రంథాలయాల్లో విద్యార్థులకు ఆటల పోటీలు



కొలకలూరులో మ్యూజికల్ చైర్ పోటీల్లో విద్యార్థులు



క్విజ్ నిర్వహిస్తున్న గ్రంథాలయాధికారి, ఉపాధ్యాయులు

తెనాలిటౌన్: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా కొలకలూరులోని శాఖ గ్రంథాలయంలో శుక్రవారం విద్యార్థులకు మ్యూజికల్ చైర్, పద్య పఠనం పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాధికారిణి కడియాల సుజాత పర్యవేక్షణలో ఉపాధ్యాయులు స్వప్న, ఏస్తేరు, శ్రీరామమూర్తి న్యాయనిర్ణేతలుగా వ్యవహించారు. నందివెలుగు శాఖ గ్రంథాలయంలో విక్టోరియా స్కూల్ విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాల ప్రాముఖ్యతను వివరించారు. గ్రంథాలయాధికారిణి బొల్లు మాధవి పర్యవేక్షించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో కవి సమ్మేళనం

తెనాలి: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక గ్రేడ్–1 శాఖ గ్రంథాలయంలో నాలుగో రోజు శుక్రవారం ఉదయం గ్రంథాలయం ప్రాముఖ్యత, తెలుగు భాషాభివృద్ధికి రచయిత పాత్ర అనే అంశాలపై కవి సమ్మేళనం నిర్వహించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ తెనాలి స్నేహ అధ్యక్షుడు కాకరపర్తి సుబ్రహ్మణ్యం కవి సమ్మేళనంలో స్థానిక కవులు సూరికుచి బదరీనాథ్, కోట లీలాకృష్ణ, విష్ణుమొలకల భీమేశ్వరప్రసాద్, ఎంపీ రఘునాథరావు, ఈఎల్‌వీ అప్పారావు, లక్కరాజు లక్ష్మణరావు, మొవ్వా సుబ్బారావు, బొల్లిముంత కృష్ణ పాల్గొన్నారు. వీరందరినీ దుశ్శాలువాతో సత్కరించారు.



కవులకు సత్కారం

6–10 తరగతుల విద్యార్థులకు 'గ్రంథాలయాలు–ఉపయోగాలు–ఆధునీకీకరణ' అనే అంశంపై ఎల్వీ అప్పారావు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. విజేతలకు ఈ నెల 20న జరిగిన వారోత్సవాల ముగింపు సభలో బహుమతులను అందజేస్తారు. లైబ్రేరియన్ కావూరి రమాదేవి, రికార్డ్ అసిస్టెంట్ లావణ్య పర్యవేక్షించారు.

విద్యార్థులకు వక్తృత్వ పోటీలు

తెనాలిరూరల్: పెదరావూరు శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయాదికారి ఎ. రాఘవేంద్రరావు ఆధ్వర్యంలో 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు సందర్భంగా విద్యార్థులకు వక్తృత్వ, క్విజ్ పోటీలు శుక్రవారం నిర్వహించారు. విశ్రాంత గ్రంథాలయాధికారి ముద్వ సుబ్బారావు పోటీలను పర్యవేక్షించారు. ఉపాధ్యాయులు పి. వెంకటకృష్ణ, కె. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

భోజన ప్యాకెట్లు పంపిణీ

తెనాలిటౌన్: కొవెరం గ్రామ మాజీ సర్పంచ్, వైఎస్సార్ సీపీ నాయకుడు గంపల శివనాగేశ్వరరావు మనుమరాలు గంపల అక్షర (అమెరికా) పుట్టిన రోజు సందర్భంగా పట్టణ రైల్వే స్టేషన్ సెంటర్ నిరు పేదలకు శుక్రవారం భోజన ప్యాకెట్లు అందజేశారు. ఈ సందర్భంగా శివనాగేశ్వరరావు మాట్లాడుతూ మిత్రమండలి సభ్యులు సేవా కార్యక్రమాల్లో భాగంగా అనాథలు, పేదలకు భోజన ప్యాకెట్లు అందజేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

మహా ధర్నాను విజయవంతం చేయండి

తెనాలి: విజయవాడలో ఈ నెల 27, 28 తేదీల్లో రైతు సంఘాల సమన్వయ సమితి, ఏపీ కార్మిక సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో జరిగే మహాధర్నాను విజయవంతం చేయాలని రైతు కూలీ సంఘం (ఆం.ప్ర) రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొల్లిముంత సాంబ శివరావు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. బీజేపీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతాంగ, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా 500లకు పైగా ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పడిన సంయుక్త కిసాన్ మోర్చా, వివిధ కార్మిక సంఘాల సమన్వయంతో దీర్ఘకాలంగా ఆందోళనలు చేస్తున్నట్లు గుర్తుచేశారు. 2020–21లో మూడు వ్యవసాయ నల్లచట్టాల రద్దు కోసం కిసాన్ మొర్చా చేసిన ఉద్యమాలతో మోదీ ప్రభుత్వం తాత్కాలికంగా వెనుకడుగు వేసిందని, పరోక్షంగా దొడ్డిదారిన అనేక రాష్ట్రాల్లో అమలు జరుపుతోందని తెలిపారు. ఈ నేపథ్యంలో సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాల సమన్వయంతో బలమైన ఉద్యమాల నిర్మాణానికి దశలవారీ ఆందోళనలు చేపడుతున్నట్టు తెలిపారు. అందులో భాగంగానే విజయవాడలో జరిగే మహాధర్నా, రైతులు పండించిన పంటలకు సమగ్ర ఉత్పత్తి వ్యయానికి 50 శాతం కలిపి మద్దతు ధర ఇచ్చి చట్టబద్ధత కల్పించాలని, కౌలు రైతులతో సహా రైతులందరికీ పంట రుణాలు ఇవ్వాలనీ, నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని, ఉద్యోగులకు పాత పింఛను పథకాన్ని పునరుద్ధరించాలనే మొత్తం 10 డిమాండ్లతో జరుగుతుందని వివరించారు.

కుష్ఠు నివారణకు ప్రభుత్వం చర్యలు

తెనాలిఅర్బన్: కుష్ఠు వ్యాధి నివారణకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోందని మున్సిపల్ ఆరోగ్యాధికారి డాక్టర్ హెలెన్ నిర్మల పేర్కొన్నారు. చెంచుపేటలోని డొంక రోడ్డులో శుక్రవారం మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కుష్ఠు బాధితుల పట్ల వివక్ష చూపవద్దని సూచించారు. డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ జంగం శ్యామ్ మాట్లాడుతూ కుష్ఠు నివారణకు అన్ని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో మల్టీ డ్రగ్ తెరపి ట్రీట్‌మెంట్ అందుబాటులో ఉందని చెప్పారు. శరీరంపై స్పర్శ లేకపోయినా.. రాగి రంగు మచ్చలు ఏర్పడితే వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో లెప్రసీ రిహాబిలిటేషన్ సెంటర్ ఆర్గనైజేషన్ డైరెక్టర్ పాముల రవికుమారి, పాముల రిచర్డ్, పాముల అనూష, జంగం హర్ష తదితరులు పాల్గొన్నారు.

ఎంపీపీ భారీ ర్యాలీ



ఎమ్మెల్యే శివకుమార్, ఎంపీపీ చెన్నకేశవులు, కౌన్సిలర్ సురేంద్రకు గజమాలతో సత్కారం

తెనాలిఅర్బన్: తెనాలి మండల ప్రజా పరిషత్ అధ్యక్షుడిగా ఎన్నికైన ధర్మరాజుల చెన్నకేశవులు ప్రమాణస్వీకారం సందర్భంగా ఆయన స్వగ్రామమైన సోమసుందరపాలెం నుంచి తెనాలి వరకు శుక్రవారం భారీ ర్యాలీ నిర్వహించారు. సోమ సుందరపాలెంలోని శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానంలో ఎమ్మెల్యే శివకుమార్, ఎంపీపీ చెన్నకేశవులు, కుటుంబ సభ్యులు, వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ గెడ్డేటి సురేంద్ర పూజలు చేశారు. భారీ ద్విచక్ర వాహనాల ర్యాలీ నడుమ బస్టాండ్, ప్రకాశం రోడ్డు, రజక చెరువు, గాంధీచౌక్, శివాజీచౌక్ మీదుగా మండల ప్రజా పరిషత్ కార్యాలయానికి వీరు చేరుకున్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులు వీరిని ప్రతి సెంటర్‌లో గజమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, రజక సంఘ నాయకులు పాల్గొన్నారు.

హాఫ్‌పేట ఉప సర్పంచ్‌గా యామిని ఎన్నిక



యామినికి ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న రిటర్నింగ్ అధికారి లక్ష్మీనారాయణ

తెనాలిటౌన్: రూరల్ మండలం హాఫ్‌పేట ఉప సర్పంచ్‌గా 8వ వార్డు సభ్యురాలు ఘంటసాల యామిని ఎన్నికయ్యారు. పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం మధ్యాహ్నం ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎం.లక్ష్మీనారాయణ పంచాయతీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. పది మంది సభ్యులకు గాను తొమ్మిది మంది హాజరయ్యారు. ఉప సర్పంచ్ పదవికి ఇద్దరు సభ్యులు సత్యాల గోపింద్, ఘంటసాల యామిని పోటీ చేశారు. యామినికి ఐదుగురు, గోవింద్‌కు నలుగురు సభ్యులు, సర్పంచ్ మద్దతు పలుకగా ఇద్దరికీ సమానంగా ఓట్లు వచ్చాయి. దీంతో ఎన్నికల అధికారి లాటరీ పద్ధతిలో పేర్లు రాసి తీశారు. లాటరీలో యామిని పేరు రావడంతో ఆమెను ఉప సర్పంచ్‌గా ప్రకటించారు. ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తలమాల యర్రయ్య, ఎంపీటీసీ సభ్యులు ఇసుకపల్లి సుందరరావు, పంచాయతీ కార్యదర్శి పి.శ్రీనివాసరావు, మాజీ ఎంపీటీసీ గోవతోటి సుధాకర్ పాల్గొన్నారు.

యువ ఓటర్ల నమోదుపై ప్రత్యేక దృష్టి

కొల్లిపర: ప్రతి గ్రామంలో యువ ఓటర్ల నమోదుపై బీఎల్‌ఓలు ప్రత్యేక దృష్టి పెట్టాలని తహసీల్దారు జి.నాంచారయ్య అన్నారు. శుక్రవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణలో బీఎల్‌ఓలతో ఓటర్ల నమోదు ప్రక్రియపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబంధనలు పాటిస్తూ పారదర్శకమైన ఓటర్ల జాబితాకు బీఎల్‌ఓలు కృషి చేయాలన్నారు. 18, 19 ఏళ్ల యువ ఓటర్లపై ప్రత్యేక దృష్టి సాధించి, ఎటువంటి తప్పులు లేకుండా నమోదు చేయాలని సూచించారు. ఎక్కడైనా డోర్ నంబర్ లేకుండా ఓటు హక్కును కలిగి ఉన్న ఓటర్ల వివరాలు సేకరించి తమ దృష్టి తీసుకురావాలని ఆదేశించారు. ఓటర్ల నమోదు, తొలింగింపు, మార్పులు వంటి విషయంలో బీఎల్‌ఓలు తప్పనిసరిగా రికార్డుల్లో నమోదు చేయాలని, అలా నమోదు చేయకుండా ఓటర్ల నమోదు, తొలిగింపు, మార్పులు చేసిన బీఎల్‌ఓలపై తగు చర్యలు తీసుకోవటం జరుతుందన్నారు. డిసెంబర్ నాటికి ఓటర్లకు సంబంధించిన అన్ని పక్రియలు పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ శ్రీనివాసరావు, ఏఎస్ఓ మనోహర్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ కోటేశ్వరరావు(సాయి), కంప్యూటర్ ఆపరేటర్ ఈమని సురేంద్రారెడ్డి, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో లక్ష మోదక హోమం



పూర్ణాహుతి చేస్తున్న నాగరాజశర్మ అవధాని

గుంటూరు ఈస్ట్: సంపత్ నగర్ మెయిన్ రోడ్డులోని హరి సన్నిధి ఆధ్యాత్మిక సేవా సంస్థ ప్రాంగణంలో శుక్రవారం లక్ష మోదక హోమం విశేషంగా నిర్వహించారు. గణపతి మూల మంత్రంతో చతురావృతి క్షీరతర్పణం కన్నుల పండువగా చేశారు. గణపతి మూలమంత్రంతో సహస్ర మోదక హోమం విశేష ద్రవ్యాలతో నిర్వహించారు. వేదోక్తంగా పూర్ణాహుతి గావించారు. చండీ సప్తశతి పారాయణం, మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, నవగ్రహ నక్షత్ర జపాలు నిర్వహించారు. ఆధ్యాత్మిక సేవా సంస్థ వ్యవస్థాపకులు కోటా నాగరాజశర్మ అవధాని మాట్లాడుతూ ప్రతినెలా శుద్ధ చవితినాడు లోక కల్యాణార్థం, వంద నెలల పాటు హోమం నిర్వహిస్తున్నామని చెప్పారు. భక్తులు పాల్గొని గణపతి ఆశీర్వాదం పొందాలని ఆయన కోరారు.

ఏఎన్‌యూలో జాతీయ సదస్సు బ్రోచర్ ఆవిష్కరణ



జాతీయ సదస్సు బ్రోచర్ ఆవిష్కరిస్తున్న వీసీ రాజశేఖర్ తదితరులు

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఎకనామిక్స్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించనున్న జాతీయ సదస్సు బ్రోచర్‌ను శుక్రవారం వీసీ ఆచార్య పి. రాజశేఖర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'భారతదేశ వ్యవసాయ రంగంలో అధునాతన సాంకేతిక సవాళ్లు, వ్యూహాలు – ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక సూచన' అనే అంశంపై ఎకనామిక్స్ విభాగం ఆధ్వర్యంలో వచ్చే ఏడాది ఫిబ్రవరి 8, 9 తేదీల్లో జాతీయ సదస్సు నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. యూనివర్సిటీ ఎకనామిక్స్ విభాగాధిపతి, సదస్సు డైరెక్టర్ ఆచార్య కె. మధుబాబు మాట్లాడుతూ సదస్సులో 12 ప్రత్యేక అంశాలపై సుదీర్ఘంగా చర్చించి, వాటిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సమర్పిస్తామని చెప్పారు. సదస్సులో ఉత్తరాఖండ్ డూన్ యూనివర్సిటీ డీన్, ఎకనామిక్స్ విభాగాధిపతి ఆచార్య పి. మంగైన్ కీలకోపన్యాసం చేయనున్నారని, ప్రత్యేక ఆహ్వానితులుగా తుల్జాపూర్ టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ అధ్యాపకులు ఆచార్య జైన్ హాజరవుతారని తెలిపారు. వ్యవసాయ రంగంలో జన్యుపర విత్తనాల వినియోగం, సుసంపన్న, సూక్ష్మ పోషకాహారం, బిందు, తుంపర సేద్యాలు, వ్యవసాయంపై వాటి ప్రభావం, సంస్థాగత వనకల్పనలు, ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన ప్రభావం, వ్యవసాయ ఉత్పత్తులు, మార్కెటింగ్ రంగాల్లో నూతన సంస్కరణలు, వ్యవసాయ రంగ అనుబంధ ఉత్పత్తుల ద్వారా రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేసే అంశాలు, రైతు భరోసా కేంద్రాల పాత్ర, ప్రకృతి సేద్యం, చిన్న, సన్నకారు రైతుల ఆత్మహత్యలు, ఆంధ్రప్రదేశ్‌లో మత్స్య పరిశ్రమ తదితర అంశాలపై ఈ సదస్సులో పరిశోధనా పత్రాలు సమర్పించవచ్చని ఆయన సూచించారు. వచ్చే ఏడాది జనవరి 25వ తేదీలోగా వాటిని సమర్పించాలని తెలిపారు. పోస్టర్ ఆవిష్కరణలో రిజిస్ట్రార్ ఆచార్య బి. కరుణ, ఎకనామిక్స్ విభాగ హానరరీ అధ్యాపకులు ఆచార్య సీఎస్ఎన్ రాజు, విభాగ అధ్యాపకులు పాల్గొన్నారు.

రేపు కిడ్నీ వ్యాధుల వైద్య శిబిరం

గుంటూరు మెడికల్: సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ (ఎస్‌హెచ్‌ఓ), మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో డయాబెటిక్ నిరోధక మాసం సందర్భంగా ఈనెల 19న ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 'కిడ్నీ వ్యాధుల ఉచిత వైద్య శిబిరం– శాస్త్రీయ అవగాహన సభ' నిర్వహిస్తున్నట్టు సంస్థల అధ్యక్షులు డాక్టర్ టి.సేవకుమార్, పావులూరి రమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరులోని 2/1 బ్రాడీపేటలో గల ఎస్‌హెచ్‌ఓ బిల్డింగ్‌లో నిర్వహించే వైద్య శిబిరంలో కిడ్నీ వ్యాధుల వైద్య నిపుణులు డాక్టర్ కె.రఘురాం పాల్గొంటారని పేర్కొన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని వారు కోరారు.

ఆనాథ ఆశ్రమంలో పండ్ల పంపిణీ

గుంటూరు రూరల్: రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్‌కే రోజా జన్మదిన వేడుకల్లో భాగంగా శుక్రవారం నగర మున్సిపల్ కార్పొరేషన్ కో–ఆప్షన్ సభ్యుడు, రాష్ట్ర నూర్‌బాషా సంఘం అధ్యక్షుడు కె. పీర్ మహమ్మద్ ఆధ్వర్యంలో అనాథ, వృద్ధాశ్రమాలు, మదర్‌సాలలో పండ్లు, పలహారాలు పంపిణీ చేశారు. గోరంట్లలోని గోతాలస్వామి ఆశ్రమంలో 120 మందికి, మారుతీనగర్‌లోని మదర్‌సాలో 100 మంది చిన్నారులకు పండ్లు, పలహారాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పీర్ మహ్మద్ మాట్లాడుతూ పేదవారికి సాయం చేయడంలో ఎంతో ఆనందం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ముత్యాల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

జీడీసీసీ బ్యాంక్‌లో ముగ్గురికి జీఎంలుగా పదోన్నతులు

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంక్‌లో డెప్యూటీ జనరల్ మేనేజర్లుగా పని చేస్తున్న వి.వి.ఎస్. ఫణికుమార్, సీహెచ్. అజయ్ కిశోర్, కె.మాధవీలకు జనరల్ మేనేజర్లుగా పదోన్నతి కలిప్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. క్రోసూరు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘంలో షేక్ గస్ సైదాకు గుమస్తాగా కారుణ్య నియామకం కింద పత్రం అందజేశారు. ఆయన తండ్రి క్రోసూరు పీఏసీఎస్‌లో గుమస్తాగా పని చేస్తూ ఇటీవల మరణించారు. అనంతరం జీఎంలుగా పదోన్నతులు పొందిన ముగ్గురిని బ్యాంక్ చైర్మన్ లాలుపురం రాము, బ్యాంక్ సీఈవో టి.కృష్ణవేణి, పాలకవర్గ సభ్యులు, పలువురు బ్యాంక్ అధికారులు ఘనంగా సత్కరించారు.

నిజాయతీ చాటుకున్న ఆటోడ్రైవర్

పట్నంబజారు: ఆటోలో మరిచిపోయిన పర్సును ప్రయాణికుడికి అప్పగించి ఆటోడ్రైవర్ నిజాయతీని చాటుకున్నాడు. లాలాపేట పోలీసు స్టేషన్ సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం... గుర్తు తెలియని వ్యక్తి హిమని కూల్‌డ్రింక్ సెంటర్ వద్ద ఆటో ఎక్కి ఆర్టీసీ బస్టాండ్ వద్ద దిగి వెళ్లిపోయాడు. అనంతరం డ్రైవర్ షేక్ జానీ బాషా తన ఆటోలో పర్సు ఉండటం గమనించి అప్పటికప్పుడు బస్టాండ్‌లోకి వెళ్లి వెతకగా, ప్రయాణికుడు కనబడలేదు. తర్వాత దాన్ని లాలాపేట పోలీసులకు అందజేశాడు. అందులో రూ. వెయ్యి నగదు, మూడు ఏటీఎం కార్డులతోపాటు, పలు గుర్తింపు కార్డులు ఉన్నాయి. సదరు వ్యక్తి లాజరస్‌గా గుర్తించి పోలీసులు విషయాన్ని అతడికి తెలియజేశారు. నిజాయతీ చాటుకున్న ఆటో డ్రైవర్ జానీబాషాను లాలాపేట పోలీసులు అభినందించారు.

రేపు సినీ సంగీత విభావరి

పాత గుంటూరు: అమరావతి రోడ్డులోని అన్నదాన సమాజం ఆడిటోరియంలో ఆదివారం ఘంటసాల స్వర నీరాజనం పేరిట 12 గంటల పాటు నిర్విరామ సంగీత విభావరి నిర్వహించనున్నట్లు శ్రీ శుభాంజలి కళావేదిక అధ్యక్షుడు మేకల పురుషోత్తమ ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకు జరిగే కార్యక్రమంలో సంగీత అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.